# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 25, ఏప్రిల్ 2026


# ఉపాధి హామీ కూలీల సంక్షేమమే ప్రాధాన్యం

★ ఉపాధి హామీ అమల్లో అలసత్వం చేస్తే చర్యలు తప్పవు

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కూలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం భీమిని మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగామోహన్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 6 గంటలకే పనికి హాజరై, ఉదయం 11 గంటలలోపు ఇంటికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనిస్థలాల్లో నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో రహదారులు, వ్యక్తిగత పనులు నిబంధనల ప్రకారం మంజూరు చేస్తామని, ప్రతి కూలీ 100 రోజుల పని పూర్తి చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామ సభల ద్వారా గుర్తించిన పనులను ప్రాధాన్యతగా చేపడుతున్నామని, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు 90 రోజుల ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, ఫారం పాండ్లు, చేపల చెరువులు వంటి పనులు కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న భీమిని, బిట్టూరుపల్లి, చిన్నగుడిపేట క్షేత్ర సహాయకులు లీలావతి, సాయిరాం, సత్యనారాయణలను శాలువాలతో సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. అనంతరం భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, పరిశుభ్రతను పరిశీలించారు. గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని, సాధారణ ప్రసవాలు మిగతా 2లో..

# ఆర్టీసి కార్మికుల సమ్మెకు బిజెపి మద్దతు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

ఆర్టీసి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం 3వ రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమింప చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆసిఫాబాద్ డిపోలో చేస్తున్న సమ్మెకు మద్దతుగా బిజెపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, ఎఫ్సిఐ బోర్డు సభ్యులు పులగం తిరుపతి, కేశవరెడ్డి, గోవర్ధన్, విశాల్ ఖండ్రే తో కలిసి మద్దతు తెలిపారు. కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఆసిఫాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిపో ఎదుట నిరసన తెలిపారు. దీంతో పోలీసులు, కార్మికులకు వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆసిఫాబాద్ మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్యం కారణంగా కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, 50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి ఉంటే ఆయన బ్రతికే వారని అన్నారు. కార్మిక సంఘాలను రద్దు చేసి వారి హక్కులను కాలరాసిందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులు ధైర్యంగా పోరాటం చేయాలని, అఘాయిత్యం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



## ఇండ్ల గణన కార్యక్రమాన్ని
# పకడ్బందీగా చేపట్టాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

జనగణన 2026లో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి 32 అంశాలపై సమాచారాన్ని స్పష్టంగా సేకరించాలని, ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శిక్షకులు అందించే ప్రతి అంశాన్ని మిగతా 2లో..



## తప్పుడు వార్తలకు తావులేకుండా
# మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

మీడియా సంస్థలు ప్రజలకు నిజమైన సమాచారం అందించే బాధ్యతను నెరవేర్చాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి, కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు, న్యూస్ చానళ్ల ప్రజలకు వాస్తవాలను స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. 2026-28 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్.టి. 103 ప్రకారం అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేసే ప్రక్రియలో కమిటీ సభ్యులు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అర్హత లేకుండా కొందరు పాత్రికేయులుగా వ్యవహరించడం వల్ల నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రిడిటేషన్ కోసం మిగతా 2లో..



## ఇండ్ల గణన కార్యక్రమాన్ని
# పకడ్బందీగా చేపట్టాలి

**(మొదటిపేజీ తరువాయి)**

నోట్ చేసుకోవాలని, ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 994 మంది ఎన్యుమరేటర్లు, 174 మంది సూపర్వైజర్లు ఇండ్ల గణన కార్యక్రమంలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. 1689 ఇండ్ల జాబితా బ్లాక్ లను గుర్తించడం జరిగిందని, ఇన్నోరేటర్లు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఇండ్ల గణన ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బీర్మా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు వార్తలకు తావులేకుండా
# మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారినే ఎంపిక చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, డేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్ పాల్గొన్నారు. అలాగే జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, జి. రవితేజ, సునీల్ కుమార్ హాజరయ్యారు.

# యాకర్‌పల్లిలో మొక్కజొన్న ఉపకేంద్రం ఏర్పాటు చేయాలి

**- కలెక్టర్‌కు రైతుల వినతి**

**సారంగాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

మండలంలోని యాకర్‌పల్లి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ వడ్లకొండ దివ్య నవీన్ ఆధ్వర్యంలో రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రమైన సారంగాపూర్‌లో కొనుగోలు కేంద్రం ఉన్నప్పటికీ, అది తమ గ్రామానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉందని రైతులు ఈ సందర్భంగా వివరించారు. దూరభారం కారణంగా రవాణా ఖర్చులు పెరిగిపోతున్నాయని, ఫలితంగా గిట్టుబాటు ధర రాక దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యాకర్‌పల్లి గ్రామంలో ఈ సీజన్‌లో సుమారు 350 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, దాదాపు 40 లారీల దిగుబడి వచ్చే అవకాశం ఉందని సర్పంచ్ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ధాన్యాన్ని తరలించడం రైతులకు భారంగా మారిందని తెలిపారు. ఉపకేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమి గ్రామంలో అందుబాటులో ఉందని, షెడ్, విద్యుత్, తాగునీటి వసతి కల్పించేందుకు గ్రామ పంచాయతీ సిద్ధంగా ఉందని సర్పంచ్ వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని యాకర్‌పల్లిలో ఉపకేంద్రం మంజూరు చేసి, ప్రభుత్వ మద్దతు ధరకు పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ కూలీల సంక్షేమమే ప్రాధాన్యం

**(మొదటిపేజీ తరువాయి)**

పెంచేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. మందుల నిల్వలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా ఉంచాలని ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి హాజరు పట్టిక, భూభారతి దరఖాస్తుల పరిశీలన చేశారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిపోల్చి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా అమలు చేయాలని సూచించారు. ఉపాధి హామీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల విజయానికి ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. అనంతరం కన్నెపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వేసవి కాలంలో వడదెబ్బ నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

# శెట్‌పల్లి గ్రామ ప్రజలకు షీ టీమ్స్‌పై అవగాహన సదస్సు

**జైపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇంచార్జి ఎస్ఐ హైమ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది శుక్రవారం మండలంలోని శెట్‌పల్లిలో గ్రామ ప్రజలకు షీ టీమ్స్ పనితీరు మహిళా చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మహిళల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న షీ టీమ్స్ పట్ల ప్రతి మహిళలు అవగాహన కలిగి ఉండాలని, వేధింపులకు గురైతే మౌనంగా భరించకుండా షీ టీమ్ పోలీసులను సంప్రదించాలని పిలుపునిచ్చారు. పని ప్రదేశాల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ ఎవరైనా మహిళలను వేధింపులకు గురిచేస్తే వెంటనే డయల్ 100 లేదా డయల్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, బాధితులు ధైర్యంగా ముందుకు రావాలని భరోసా ఇచ్చారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల, అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని మహిళలకు వివరించారు. ఆన్ లైన్ మోసాలకు జరిగినపుడు బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు గృహహింస నిరోధక చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుల్ సతీష్ మహిళా కానిస్టేబుల్ జ్యోతి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఓం ప్రకాష్, శెట్‌పల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలి

**- ఎస్టీపిపి జీఎం ఎం. మదన్ మోహన్**

**జైపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రోడ్ భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జీఎం మదన్ మోహన్ అన్నారు. శుక్రవారం ప్లాంట్‌లోని ఉద్యోగులకు అర్థమయ్యేలా మెయిన్ గేటు వద్ద శ్రీరాంపూర్ కళాకారులు తాజుద్దీన్ మేడ పెద్దయ్యలు యముడు, చిత్రగుప్తుని వేషధారణ ధరింపజేసి, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు,కారు నడిపే వారు హెల్మెట్, సీట్ బెల్ట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ పాటించని వారికి ఏదైనా ప్రమాదం జరిగితే వారి యొక్క కుటుంబం రోడ్డు మీద పడుతుందని వివరించారు. ప్రమాదాలు జరిగే వరకు చూడకుండా ముందుగా రక్షణ సూత్రాలు పాటిస్తూ వాటిని నివారించాలన్నారు. దేశంలో ప్రతిరోజు వేలాదిమంది రోడ్డు ప్రమాదాల్లో తమ ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. సమయానికి గమ్యం చేరడం కంటే, సురక్షితంగా ఇంటికి చేరడం ముఖ్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ విధిగా ధరించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి. పంతుల, పవర్ మెక్ ప్లాంట్ హెడ్ అచల్ కపూర్, డీజీఎం (సి అండ్ ఐ) డీ.జి.ఎం శివ ప్రసాద్, (ఆపరేషన్స్) డీజీఎం సంతోష్ కుమార్, డీజీఎం (పర్సనల్) డీజీఎం కిరణ్ బాబు,యాష్ డీజీఎం స్వామి రాజు, (స్టోర్) ఎస్ఈ శ్యాం సుందర్, ప్లాంట్ సేఫ్టీ అధికారి పులి సురేష్, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలు

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

గ్రామ పంచాయతీలే దేశానికి పట్టు కొమ్మలని కొత్త కొమ్ముగూడెం సర్పంచ్ సందెల సుజాత పేర్కొన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం గ్రామంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యలపై కూలంకషంగా చర్చించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుమన్, కార్యదర్శి సురేందర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

సారంగాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఎల్పీఓ లింగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పంచాయతీలు సొంత ఆదాయ వనరులను సమకూర్చుకుంటూ స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయాలని కోరారు. అనంతరం గ్రామంలో నాలుగు కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం కోసం మార్కౌట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అజీజ్ ఖాన్, గ్రామ సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొనుగోలు ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న అప్పల రాజ్యలక్ష్మి రాకేష్

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అప్పల రాజ్యలక్ష్మి రాకేష్

భైంసా, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:

భైంసా మండలంలోని మహాగం గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు ఉపకేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పల రాజ్యలక్ష్మి రాకేష్ మాట్లాడుతూ.. మహాగంతో పాటు పరిసర గ్రామాల రైతులు తమ పంటకు మద్దతు ధర పొందాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధర లభిస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాలనే సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినందుకు ఆమె ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సొసైటీ సీఈఓ రాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాసిపేట గనిలో కార్మికుల సమస్యలపై గళమెత్తిన టిఎన్టియుసి

బెల్లంపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కాసిపేట గని పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం టిఎన్టియుసి ఆధ్వర్యంలో కార్మిక బాట కార్యక్రమం నిర్వహించబడింది. గనిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను టిఎన్టియుసి నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా అనారోగ్యంతో బాధపడుతూ మెడికల్ బోర్డు కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులకు ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న కోల్ కట్టర్స్‌కు అవసరమైన డ్రిల్ రాడ్స్, డ్రిల్ బిట్స్ కొరత తీవ్రంగా ఉందని, లైన్మెన్‌లకు సరిపడా మాన్‌పవర్ లేకపోవడం, లైన్లు కొట్టేందుకు కీలాలు, గిరి మెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల పనులు సక్రమంగా సాగడం లేదని తెలిపారు. సపోర్ట్ మెన్‌లకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచడం లేదని కూడా విమర్శించారు. మైనింగ్ డిప్లొమా పూర్తి చేసిన ఓవర్‌మన్‌లతో సర్దార్ కం షాట్ ఫైరింగ్ వంటి మూడు పనులు చేయించడం అన్యాయమని, మైనింగ్ ఓఎంలకు ఒప్పందం ప్రకారం ఐదు సంవత్సరాలు పూర్తైన వెంటనే బ్బి గ్రేడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గనిలో పనిచేస్తున్న కార్మికులకు శాశ్వతంగా మినరల్ వాటర్ సరఫరా చేయాలని, పదవీ విరమణ చేసిన రోజునే టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. ఎస్‌డిఎల్, ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్లకు ఫ్ఠ గ్రేడ్ అమలు చేయాలని కూడా తెలిపారు. 11వ వేతన కాలపరిమితి 01-07-2026తో ముగియనున్న నేపథ్యంలో వెంటనే 12వ వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘాలు విఫలమయ్యాయని టిఎన్టియుసి నాయకులు ఆరోపించారు. సమస్యలను గని మేనేజర్ మరియు జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం కాలేదని తెలిపారు. సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే జీఎం కార్యాలయం ముందు భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎస్‌సిఎల్‌యూ, టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి. మనీరామ్ సింగ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొల్లు మల్లయ్య (రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి), గడిపల్లి శంకర్ (మందమరి ఏరియా ప్రధాన కార్యదర్శి), గజ్జల దుర్గయ్య, ఎస్.ఎస్. పాండే, కొత్తూరు నారాయణ, గైని తిరుపతి, ఎస్. రాజు, జె. శ్రీనివాస్, బైరి సంపత్, ఎండి అన్వర్, మాసాది గోపాల్, ఎర్రం వెంకటి తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

జైపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

మండలం లోని ఇందారం గ్రామంలో కాసింపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన 29 లక్షల 97 వేల అంచనా వ్యయంతో సింగరేణి యాజమాన్యం చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి అయి, దాదాపు రెండు సంవత్సరాలకు పైనే అవుతుందని ఇప్పటికైన ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఇందారం మాజీ ఎంపీటీసీ, బిఆర్ఎస్ నాయకులు అరికె స్వర్ణ సంతోష్ యాదవ్ మాజీ వార్డు నెంబర్ అమీర్ ఇందారం ఓపెన్ కాస్ట్ పిఓ వెంకటేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు దీనికి స్పందించిన పిఓ వెంకటేశ్వర్ రెడ్డి శ్రీరాంపూర్ జిఎంతో మాట్లాడి తొందర్లోనే కమ్యూనిటీ హాల్ ప్రారంభించి అందరికీ ఉపయోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.



## వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగ జాబితాలో చేర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వర్తక సంఘం అధ్యక్షుడు

జన్నారం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



శ్రీ వాసవి మాత జయంతిని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగ జాబితాలో చేర్చడంపై జన్నారం వర్తక సంఘం అధ్యక్షులు వోజ్జల వామన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వర్తక సంఘం అధ్యక్షులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం ఆర్యవైశ్యుల చిరకాల వాంఛ అని, ప్రభుత్వ నిర్ణయం సమాజానికి గౌరవం కలిగించిందని పేర్కొన్నారు.తెలంగాణ స్టేట్ ఆర్య వైశ్య కార్పొరేషన్, ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కృషిని కూడా ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జక్కు రమేష్, కోశాధికారి శివరామకృష్ణ, సంఘ సభ్యులు ఉన్నారు.

## చింతగూడలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

- వడదెబ్బపై అప్రమత్తం చేసిన సర్పంచ్ సుమలత

జన్నారం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

మండలంలోని చింతగూడ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గురువారం సర్పంచ్ సుతారి సుమలత మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుమలత మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అందరికీ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం పని ప్రదేశంలో నీడ నెట్ ఏర్పాటు చేశామని, కూలీలు ఎక్కువ నీరు తాగుతూ, మధ్యాహ్నం వేళ జాగ్రత్తగా ఉండాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిడివో ఉమర్ షరీఫ్, పంచాయతీ కార్యదర్శి రాజన్న, ఉప సర్పంచ్ అసంపెల్లి కావ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మారుమూల గ్రామాల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత: ఎమ్మెల్యే

సిరికొండ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:



మారుమూల ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. సిరికొండ మండలం నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుల్‌గూడలో ఆర్‌పీజీ ఫౌండేషన్, ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఇచ్చోడ నుండి సిరిచేల్మ వరకు రూ. 43 కోట్లతో డబుల్ రోడ్డు పనులు మంజూరయ్యాయని వెల్లడించారు. అలాగే ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన సిరిచేల్మ ఆలయ అభివృద్ధి కోసం రూ. 5 కోట్లు కేటాయించామని, ఈ పనులన్నీ త్వరలోనే ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా, తాగునీటి సౌకర్యాలు అందించడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యానికి పునాది పంచాయతీరాజ్





**సిర్పూర్ (టి), ఏప్రిల్ 24 ప్రభాతవార్త :**

మండలంలోని చింతకుంట గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆజ్మీర ఛత్రు నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించబడింది. గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యానికి పునాది అయిన పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు గ్రామ స్థాయిలో బలపడితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే గ్రామాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించి, గ్రామ ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు. ప్రభుత్వ పథకాల అమలు, శుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శాలిని, ఉప సర్పంచ్ మోహన్, వార్డు సభ్యులు శ్రీనివాస్, నరేష్, శేఖర్, స్వరూప, అంజన్న, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

**తాండూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

మండలంలోనిరాజీవ్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపసర్పంచ్ కాపర్తి సుభాష్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలోని పలు సమస్యలపై పాలకవర్గం, ప్రజలు చర్చించారు. వార్డు సభ్యులు, ప్రజల నుండి సలహాలు స్వీకరించి నిధుల కేటాయింపు చేసి సమస్యలు పరిష్కరిస్తామని తీర్మానించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, నిధులు మంజూరు కోసం డిసిసి ఉపాధ్యక్షులు స్నూర రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. గ్రామసభలో వార్డు సభ్యులు తాటి పాముల రాము, ఆయిల్ల రాజకుమార్, లింగంపల్లి అభీల, రౌతు భారతి, కస్తూరి రమేష్, చెప్యాల నిరంజన్, పంచాయతీ సెక్రటరీ రమాదేవి నాయకులు మామిడాల రాజేశం, ప్రజలు పాల్గొన్నారు.



## మహాపాదుక పూజోత్సవానికి ఆహ్వాన పత్రిక అందజేత

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని పవిత్ర పూజ క్షేత్ర సభ్యులకు శుక్రవారం మహాపాదుక పూజోత్సవ ఆహ్వాన పత్రికను నిర్వాహకులు అందజేశారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా, మనోర్ సమీపంలోని దహీసర్‌లో గల "నమోమోజయా: శ్రీయోగభూక్షేత్రం"లో నిర్వహించనున్న ఈ మహోత్తర కార్యక్రమానికి భక్తులందరూ హాజరుకావాలని కోరారు. శ్రీ శ్రీ శ్రీ పరమ పూజ్య మహా ప్రేమవతార్ శ్రీ పరబ్రహ్మ మహారాజ్ వారి అనుగ్రహం కోసం నిర్వహించే ఈ వేడుకలు మే 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నాలుగు రోజుల పాటు ధ్యాన చైతన్య విహారయాత్ర, పాదుకల ప్రారంభోత్సవం, పాలరాతి నాగేంద్రుడి స్థాపన, యోగ భూమి సత్సంగం హాల్ ప్రారంభం, జై మహా ఓజోమాతాది వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలను భక్తులు సద్వినియోగం చేసుకుని గురుదేవుల ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

# రిజర్వేషన్ అమలులో అలసత్వం సహించం

### - మున్సిపల్ అధికారులకు ఎస్సీ,ఎస్టీ కమిషన్ హెచ్చరిక

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



హైదరాబాద్ బేగంపేట టూరిజం ప్లాజాలో రాష్ట్రంలోని మున్సిపల్ పరిపాలనపై కీలక సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అన్ని జిల్లాల మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో ముఖ్యంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ అంశాలపై చర్చ జరిగింది. చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నియామకాలు, బదిలీలు, ప్రమోషన్లలో రిజర్వేషన్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులకు గట్టిగా హెచ్చరించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక లైజనింగ్ అధికారులను నియమించాలని సూచించారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పరిశుద్ధ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికులను తొలగించిన పక్షంలో, వారి కుటుంబ సభ్యులకు లేదా వారు సూచించిన వ్యక్తులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. కార్మికులకు భద్రతా దృష్ట్యా హెల్మెట్‌లు, యూనిఫాం, హ్యాండ్ గ్లౌవ్స్, మాస్కులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పీఎన్‌సీ సమావేశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ తమ వర్గాల హక్కుల పరిరక్షణలో కాస్టోడియన్‌గా పనిచేస్తుందని పేర్కొంటూ, ఎలాంటి సమస్యలు ఉన్నా కమిషన్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.



## మక్కా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి: మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి గ్రామస్థుల వినతి

**భైంసా, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

నర్సాపూర్ (జి) మండలంలోని తురటి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్థులు శుక్రవారం భైంసాలోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. దీనిపై విఠల్ రెడ్డి స్పందిస్తూ.. నియోజకవర్గంలో మక్కా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మార్క్‌ఫెడ్ ఎండీతో చర్చించినట్లు తెలిపారు. ముధోల్ నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 29 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఈనెల 20వ తేదీన లేఖ ద్వారా మంత్రిని కోరినట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం త్వరితగతిన స్పందించి కేంద్రాలను ప్రారంభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌర శ్యాంసుందర్, వీడీసీ అధ్యక్షుడు ఎడిపల్లి రాజేశ్వర్, రాజేందర్ రెడ్డి, మధుకర్, గొర్ల ముత్యం, నవీన్, భీమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనపై గ్రామస్తులకు చైతన్యం

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**




ప్రజలతో అవగహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మండలంలోని దరోగపల్లి పంచాయతీలో గంజాయి, గుడుంబా మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టెందుకు పోలీసులు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా శుక్రవారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గఅధికారులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వాళ్ళ కలిగే అనర్థాలపై విపులంగా వివరించారు. గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల కుటుంబాలు ఆర్థిక, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గ్రామంలో ఎవరైనా మత్తు పదార్థాలు తయారీ, రవాణా లేదా సరఫరా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనం గడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ రవి, ఎక్సైజ్ ఎస్సై సురేష్, స్థానిక ఎస్సై అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం: ఎంపీఓ గోవర్ధన్

**దిలావర్పూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**



దిలావర్పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, పారిశుద్ధం, సామాజిక భాగస్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీఓ గోవర్ధన్ మాట్లాడుతూ.. గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఆర్థిక రంగాల్లో గ్రామాన్ని మరింత బలోపేతం చేసేందుకు వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సర్పంచ్ రమణారెడ్డి మాట్లాడుతూ.. అధికారుల సమన్వయంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజా భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పరంగా వాసవిమాత జయంతి వేడుకలపై ఆర్యవైశ్యుల హర్షం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై ఆర్యవైశ్య సమాజంలో ఆనందం వెల్లివిరిసిందని ఆసిఫాబాద్ ఆర్యవైశ్య సంఘం నాయకులు చిలివేరి వెంకటేశ్వర్లు, గంధం శ్రీనివాస్, ప్రమోద్, బాలేష్ లు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తమ ఆరాధ్యదేవతకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల వైశ్యులు సంతోషం వ్యక్తం చేశారు. జయంతి సందర్భంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, సాంస్క్రుతిక ప్రదర్శనలు సమాజానికి మరింత గౌరవాన్ని తీసుకోస్తాయని ఆర్యవైశ్య నాయకులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా పేదలకు సహాయ కార్యక్రమాలు, అన్నదానాలు, విద్యార్థులకు ఆర్థిక సాయం, వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా వాసవిమాత ఆశయాలను కార్యరూపంలో చూపిస్తున్నామని వారు తెలిపారు. ఈ చర్యలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న వాసవిమాత జయంతి వేడుకలు ఆర్యవైశ్య సమాజానికి గౌరవం, గుర్తింపు తెచ్చి, వారి ఆనందాన్ని మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు.



సమైక్య గ్రూప్ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యురాలు

## పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

వేసవి సెలవుల సమయంలో పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని షీ టీం సభ్యురాలు స్వప్న, రజనీ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మహిళా మండల సమైక్య గ్రూప్ సభ్యులకు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు షీటీం సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్ల ద్వారా ఏం చేస్తున్నారో గమనిస్తూ వారి ఆసక్తులు, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా మైనర్ పిల్లలకు బైకులు ఇవ్వకూడదని, ఇది చట్టపరంగా నేరమని వివరించారు. పిల్లల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రొటెక్షన్ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదింపులకు గురిచేస్తున్న యువకుడి పట్టివేత...ఆసిఫాబాద్ బస్టాండ్ వద్ద ఒక అమ్మాయిని వెంబడిస్తూ వేధింపులకు గురిచేసిన యువకుడ్ని జిల్లా పోలీస్ షీ టీం బృందం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ ఇచ్చారు. షీ టీం ఎస్సై బిక్కులాల్, సిబ్బంది స్వప్న, రజిని, దినేష్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఏమైనా వేధింపులకు గురైతే వెంటనే షీ టీం సభ్యులకు సమాచారం అందించాలని కోరారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

**- విప్లవ కార్మిక సంఘాల ఆగ్రహం**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన విషాద ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. నర్సంపేట డిపోలో చోటుచేసుకున్న ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందడం కార్మిక వర్గాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. శంకర్ గౌడ్ సుమారు 80 శాతం కాలిన గాయాలతో అత్యంత ప్రమాదకర స్థితిలో ఉండగా వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి నుండి హైదరాబాద్‌కు తరలించే క్రమంలో, నగరానికి చేరుకున్న అనంతరం ఆయన కన్నుమూశారు. ఈ ఘటనపై విప్లవ కార్మిక సంఘాలు తీవ్రంగా స్పందించాయి. శంకర్ గౌడ్ మృతికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి. అలాగే ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గత నాలుగు నెలలుగా 32 డిమాండ్లతో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని సంఘాల నాయకులు విమర్శించారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడమే ఇటువంటి దుర్ఘటనలకు కారణమవుతోందని అన్నారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సమ్మెల సమయంలో కూడా పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాలను కొనసాగిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు పిలుపునిస్తూ, కార్మికులు ఇటువంటి ఆత్మహానికర చర్యలకు దూరంగా ఉండాలని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని సూచించాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, నర్సంపేటలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, టీయూసీఐ రాష్ట్ర నాయకులు గోగర్ల శంకర్, ఎఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎం. పోశమల్లు, టీయూసీఐ బెల్లంపల్లి బాధ్యులు అడ్డూరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు అభివృద్ధి చెందాలి

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

భారతదేశం అభివృద్ధి చెందాలంటే మొదట గ్రామాలు అభివృద్ధి చెందాలి అని బీజేపీ మండలాధ్యక్షులు తోట సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే గ్రామీణ ప్రాంతాలు మొదటగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందడం కోసం గ్రామ పంచాయతీలకు నేరుగా గత మూడు నెలల కాలంలో మూడు విడుతలుగా 1034 కోట్లకు పైగా నిధులు కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ, ప్రజలందరికీ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## భైంసాలో మక్కా కొనుగోలు కేంద్రం ప్రారంభం

**భైంసా, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కమలాపూర్ గుట్ట పక్కన ఉన్న మినీ స్టేడియంలో మొక్కజొన్న కొనుగోలు ఉపకేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఇచ్చిన మాట ప్రకారం రైతుల సౌకర్యార్థం ఈ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం కల్పించిన ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ రావుల రాము, కిసాన్ గల్లీ సర్పంచ్ కుంట రాజలింగు, ఉప సర్పంచ్ దీపోల్ల సాయినాథ్, కౌన్సిలర్లు నిమ్మల ప్రవీణ్, వడ్నప్ శ్రీనివాస్, అల్లెం దిలీప్, జె రాహుల్, అమూల్, చర్ల సుభాష్, ఆత్మ డైరెక్టర్ మామిడి స్వామి, సిద్ధూర్ సర్పంచ్ సుధాకర్, అల్లకొండ సతీష్, బోల్కెట్టి రాజు, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కోరారు. శుక్రవారం హైదరాబాద్ లో డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు కీలక అభివృద్ధి పనుల గురించి మంత్రి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా ఉట్నూర్-ఆసిఫాబాద్ రహదారి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కాంట్రాక్టర్‌కు రావలసిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎమ్మెల్యే కోరారు. బకాయిలు చెల్లిస్తే మిగిలిన రహదారి పనులు వర్షాకాలానికి ముందు పూర్తయ్యే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న కెరమెరి, లక్మాపూర్ బ్రిడ్జి నిర్మాణాలకు అవసరమైన నిధులను త్వరితగతిన కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ పనులు పూర్తైతే ఆ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంబంధిత విషయాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం సానుకూలంగా హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# గోదావరిలో గల్లంతైన మల్లేష్ కోసం డాగ్ స్క్వాడ్, డ్రోన్‌తో గాలింపు: సీఐ రమణమూర్తి

**జన్నారం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



దండేపల్లి మండలం నాగసముద్రానికి చెందిన గూడ మల్లేష్ ఈ నెల 16న తిమ్మాపూర్ గోదావరి తీరంలో అదృశ్యమయ్యాడు. వారం రోజులు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు, స్థానికులు శుక్రవారం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 16న రాత్రి మల్లేష్ కొందరితో కలిసి తిమ్మాపూర్‌లోని రామాలయం సమీపంలో పేకాడుతుండగా ఎవరో టార్చిలైట్ వేయడంతో పోలీసులు అనుకొని అందరూ పారిపోయారు. కొద్దిసేపటికి అందరూ ఒకచోట కలిసినప్పటికీ మల్లేష్ మాత్రం రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు సమాచారమిచ్చారు. దీంతో ఆయన భార్య సుజాత ఈ నెల 18న జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి గ్రామ సమీపంలోని గోదావరి నదితో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టారు. శుక్రవారం రోజున లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సుమారు 200 మంది గ్రామస్తులతో కలిసి గోదావరి తీరం వెంబడి, పొదల్లో, పొలాల్లో తనిఖీలు చేశారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించే వరకు గాలింపు కొనసాగిస్తామని సీఐ తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే జన్నారం పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జన్నారం, దండేపల్లి ఎస్సైలు జి. ఉదయ్ కిరణ్, తహసీనొద్దీన్, పోలీసులు, గ్రామస్తులు ఉన్నారు.

# 12వ వేతన కమిటీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి

**- కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాల తీరుపై బిఎంఎస్ ఆగ్రహం: దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు**

**నస్పూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



ఆర్.కె 5 గనిపై గేట్ సమావేశంలో ప్రసంగిస్తున్న బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

12వ వేతన కమిటీ ఏర్పాటుకు కోల్ ఇండియా యాజమాన్యం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం శ్రీరాంపూర్ ఏరియా ఆర్.కె 5 గనిపై నిర్వహించిన గేట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పంద కాలపరిమితి 2026 జూన్ 30తో ముగుస్తుందని చెప్పారు. జూలై 1 నుంచి కొత్త ఒప్పందం అమలు కావాల్సి ఉన్నా, కమిటీ నిర్మాణానికి యాజమాన్యం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని స్పష్టం చేశారు. యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య, నియంతృత్వ ధోరణి కార్మిక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోందని యాదగిరి సత్తయ్య విమర్శించారు. ఒడిశాలోని తాల్చేర్అంగుల్ ప్రాంతంలో ఏప్రిల్ 9, 10 తేదీలలో జరిగిన అ చల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్ 113వ వర్కింగ్ కమిటీ సమావేశంలో కార్మిక సమస్యలపై చర్చించినట్లు వెల్లడించారు. కార్మికుల వేతన సవరణను అడ్డుకోవడానికి అధికారులు హైకోర్టులో కేసులు వేశారని తెలిపారు. అది విఫలం కావడంతో డీపీఈ నిబంధనలను సాకుగా చూపిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల వేతన సవరణ కోసం కోల్ ఇండియాపై సుమారు 3500 కోట్ల రూపాయల అదనపు భారం పడుతున్నా యాజమాన్యం వెనకాడటం లేదని యాదగిరి సత్తయ్య ధ్వజమెత్తారు. కార్మికుల విషయానికి వచ్చేసరికి కంపెనీ ఆర్థిక పరిస్థితులపై ప్రజెంటేషన్లు ఇస్తూ, సంక్షేమ పథకాలు, సెలవులలో కోతలు విధించడం ఆందోళనకరమని హెచ్చరించారు. వేజ్ బోర్డు ఏర్పాటు కోరుతూ దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వద్ద గేట్ సమావేశాలు, జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు భారీ ఆందోళనలు చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి జీడి ప్రభాకర్, జాయింట్ సెక్రెటరీలు భూంపల్లి రమేష్, మేకల స్వామి, ఫిట్ కార్యదర్శి కొమ్మ బాపు, నాయకులు కుమ్మరి చంద్రశేఖర్, కుంట రాజు, చల్ల ప్రశాంత్,బుర్ర అరుణ్ గౌడ్,కాశవేణి సంపత్,చల్ల శ్రీనివాస్, రామగిరి శేఖర్, మంచాల రమేష్,నీరటి సురేష్,పల్లె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ భగవత్‌కు అభినందనలు

**- డీజీపీ మహేష్ భగవత్‌కు అభినందనలు తెలిపిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా పదోన్నతి పొందిన మహేష్ భగవత్ (ఐపీఎస్)ను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహేష్ భగవత్ పోలీసు శాఖలో విశేష అనుభవం, పరిపాలనా నైపుణ్యంతో గుర్తింపు పొందిన అధికారిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల భద్రత, న్యాయం పరిరక్షణలో ఆయన తీసుకునే నిర్ణయాలు రాష్ట్రానికి మరింత మేలు చేకూర్చుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, మహిళలు, బాలల భద్రత, సామాజిక న్యాయం వంటి అంశాల్లో పోలీసు వ్యవస్థ మరింత సున్నితంగా స్పందించేలా ఆయన మార్గదర్శకత్వం ఉంటుందని నమ్మకం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహిస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించే దిశగా ఆయన కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ మహేష్ భగవత్ కూడా రేణికుంట్ల ప్రవీణ్ కు ధన్యవాదాలు తెలుపుతూ, రాష్ట్ర ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు.

# వడదెబ్బపై ఉపాధి కూలీలకు అవగాహన.. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**



దిలావర్‌పూర్ సమీపంలోని పోచమ్మ చెరువు ప్రాంతంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల స్థలంలో శుక్రవారం వడదెబ్బపై అవగాహన సదస్సు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేశ్వర్ కార్మికులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్య సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఆయన తెలిపారు. తలపై రుమాలు లేదా టోపీ ధరించడం, నలుపు రంగు దుస్తులకు బదులుగా లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం మంచిదని సూచించారు. శరీరంలో నీరసం రాకుండా తరచుగా నీరు తాగాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం సమయంలో పనులను తగ్గించి విరామం తీసుకోవాలని కోరారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే నీడకు తరలించి, శరీరాన్ని చల్లబరచాలని పేర్కొన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ వీఓ శ్రీనివాస్, కూలీలు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే వినోద్

**- గంటల్లోనే పరిష్కారం, బారి గేట్లపై కీలక నిర్ణయం**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**




బెల్లంపల్లి పట్టణంలో హమాలి కార్మికులు, వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. టన్నుల బరువున్న రైస్ బ్యాగ్‌లను లోడింగ్ చేసి వ్యాపారస్తులకు అందించే సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన బారి గేట్లు పెద్ద అడ్డంకిగా మారి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను హమాలి యూనియన్ అధ్యక్షుడు గెల్లి రాజలింగు, ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బెల్లంపల్లి ఏసీపీతో చర్చించి తక్షణ చర్యలు చేపట్టించారు. ఏసీపీ సూచనల మేరకు, హమాలి కార్మికుల సౌకర్యార్థం ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నెల్కో లైన్ వద్ద ఉన్న బారి గేట్లను తొలగించి, పనులు పూర్తయ్యాక మళ్లీ యథావిధిగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో హమాలి కార్మికులు, వ్యాపారస్తులకు పెద్ద ఊరట లభించింది. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే గడ్డం వినోద్, బెల్లంపల్లి ఏసీపీ, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, వన్ టౌన్ సీఐ శ్రీనివాస్ రావులకు హమాలి కార్మికులు, వ్యాపారస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## శిక్షకుల ఎంపిక కోసం దరఖాస్తులు

**తాండూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియా గోలేటిలో నిర్వహించనున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిభిరం లో చిన్నారులకు అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్బాల్ క్రీడల పట్ల శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన శిక్షకులు ధరఖాస్తు చేసుకోవాలని పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓ డి రాజేశ్వర్ రావు కోరారు. శిక్షకులకు క్రీడాకారులకు 25 రోజుల పాటు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇవాల్సి ఉంటుందన్నారు. సింగరేణి సీనియర్ క్రీడాకారులు లేదా పీఈటిలు, జాతీయ,రాష్ట్ర స్థాయి క్రీడాకారులు శిక్షణ ఇచ్చేందుకు అర్హులన్నారు. గౌరవ వేతనంగా రూ.3.400లు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఆసక్తి గల వారు ఈ నెల 27 న మధ్యాహ్నం 2 గంటల లోపు జిఎం కార్యాలయం పర్సనల్ డిపార్ట్ మెంట్లో ధరఖాస్తులను అందజేయాలను ఆయన తెలిపారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ చింతపురి లక్ష్మి

## కోయవాగు అంబేద్కర్ చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం

**- గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం తాగునీటి ఏర్పాటు**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజల సౌకర్యార్థం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చింతలపూరి లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలు, ప్రయాణికులకు చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం గ్రామపంచాయతీ బాధ్యతగా భావించి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుస్మిత, కోయవాగు ఉప సర్పంచ్ మొరాయి శ్రీనివాస్, వార్డు సభ్యులు బాలం సాయి,ఆదే సునిత,అనసూర్య, చింతపురి మల్లేష్, గోవర్ధన్, నాయకులు లెందుగురే శ్యామ్‌రావు, శ్రీనివాస్, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం ద్వారా సేవా స్ఫూర్తి చాటిన తోడే కుటుంబం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నిదానాలకంటే అన్నదానం గొప్పది అనే సందేశంతో శుక్రవారం బెల్లంపల్లి కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమెరికా నివాసి తోడ వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల ప్రశంసలు పొందింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని బూడిదిగడ్డకు చెందిన సీనియర్ నాయకురాలు, కీర్తిశేషులు తోడే పద్మా రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని, వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, తోడే పద్మా రెడ్డి సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె స్ఫూర్తితో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీరామ్, పీక లక్ష్మణ్, మాజీ వైస్ చైర్మన్ శంకర్ సింగ్, పసులేటి వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై అన్నదానం స్వీకరించారు.

